www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 14 అక్టోబర్ 2024
5
అన్నమయ్య

చూపు లేని వారి జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

ప్రజాశక్తి-పీలేరు

కంటి చూపు లేని వారి జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యమని చాగణం లలితమ్మ భాస్కర రావు మెమోరియల్ ట్రస్ట్ లక్ష్యమని మేనేజింగ్ ట్రస్ట్ చాగణం గౌరీ శంకర్, సిఇఒ సీతారామనాయుడు తెలిపారు. ప్రతి నెలా మూడవ ఆదివారం నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరంలో భాగంగా ఆదివారం పీలేరు ఆర్యవైశ్య కల్యాణ మడపంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత సేవా కార్యక్రమాల్లో భాగంగా జరిపిన వైద్య శిబిరానికి పీలేరు మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన సుమారు 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వీరిలో 18 మందిని కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేసి తిరుపతి అరబిందో ఆస్పత్రికి తీసుకువెళ్లారని చెప్పారు. వీరికి ఉచితంగా ఆపరేషన్లు చేయించి, తిరిగి పీలేరుకు తీసుకు రావడం జరుగుతుందని తెలిపారు. 15 మందికి కంటి అద్దాలు, 40 మందికి మందులు, ఉచిత రవాణా సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఎఒ కృష్ణ గల్లా, అరవింద నేత్రాలయం సిబ్బంది జీవన్ పాల్గొన్నారు.

లిక్కర్ లక్ ఎవరికో?

- నేడు మద్యం దరఖాస్తులకు లక్కీడ్రా
- జిల్లా వ్యాప్తంగా 2,111 దరఖాస్తులు
- అన్ని ఏర్పాట్లు పూర్తి
- 16 నుంచి దుకాణాలకు గ్రీన్‌సిగ్నల్?

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో మద్యం దుకాణాలకు రికార్డు స్థాయిలో దరఖాస్తులొచ్చాయి. జిల్లావ్యాప్తంగా 111 దుకాణాలకు మొత్తం 2,111 దరఖాస్తులు అందాయి. రాయచోటి మదనపల్లి రోడ్డు అజయ్ ఫంక్షన్ హాల్‌లో లక్కీ డ్రా ఏర్పాటుకు ఎక్సైజ్ అధికారులు ఏర్పాట్లు అన్ని పూర్తి చేశారు. లిక్కర్ లక్ ఎవరికి దక్కుతుందో సోమవారం తెలియనుంది. మద్యాన్ని ప్రయివేట్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం వెలువరించిన విధివిధానాల తర్వాత జిల్లా అధికారులు ఈనెల 1న నోటిఫికేషన్ ను విడుదల చేశారు. దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం తొలుత ఈనెల9 తుది గడువుగా పేర్కొంది. దరఖాస్తుదారుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈనెల 11కు పొడిగించింది. 11న చేపట్టాల్సిన లాటరీ ప్రక్రియను 14కు మార్చింది. చివరి మూడు రోజులు దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఈనెల 10 వరకు 1465 దరఖాస్తులొచ్చాయి. చివరి రోజైన ఒక్క రోజులోనే శుక్రవారం అత్యధికంగా 646 మంది దరఖాస్తు చేశారు.

ఎక్సైజ్‌స్టేషన్ వారిగా దరఖాస్తులు..

అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 8 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లున్నాయి. 111 మద్యం షాపులకు 2111 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో రాయచోటి 16 మద్యం షాపులకు 422, లక్కిరెడ్డిపల్లి 7 మద్యం షాపులకు 150, రాజంపేటలో 20 మద్యం షాపులకు 253, రైల్వే కోడూరులో 19 మద్యం షాపులకు 224, మదనపల్లిలో 22 మద్యం షాపులకు 649, మొలకలచెరువులో 9 మద్యం షాపులకు 199, వాయల్పాడులో 9 మద్యం షాపులకు 78, పీలేరులో 9 మద్యం షాపులకు 136 దరఖాస్తులు వచ్చాయి.

ప్రభుత్వానికి రూ.42.22 కోట్ల ఆదాయం

జిల్లాలోని 111 దుకాణాలకు మొత్తం 2,111 మంది దరఖాస్తులొచ్చాయి. ఒక్కొక్కరు రూ.రెండు లక్షలు చొప్పున డిడి రూపంలో ప్రభుత్వానికి డిపాజిట్ చెల్లించారు. దీంతో దరఖాస్తుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 42.22 కోట్ల ఆదాయం సమ కూరింది. ఇందులో 30 మండలాల పరిధిలోని 111 దుకాణాల ద్వారా రూ.42.22 కోట్ల జిల్లా నుంచి ఆదాయం వచ్చింది.

పకడ్బందీగా నిర్వహిస్తాం

మద్యం దుకాణాలకు లాటరీ పద్ధతులో పకడ్బందీగా నిర్వహిస్తాం. సోమవారం లాటరీ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందుకనుగుణంగా రాయచోటి మదనపల్లి రోడ్డులో ఉన్న అజయ్ ఫంక్షన్ హాల్ లో లాటరీ ప్రక్రియకు ఏర్పాట్లుకు అన్ని చర్యలు తీసుకున్నాం. జిల్లాలో ఉన్న 8 ఎక్సైజ్ స్టేషన్ల వారీగా లాటరీ నిర్వహిస్తున్నాం. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో లాటరీని తీస్తారు. గుర్తింపుకార్డులు ఉన్న దరఖాస్తుదారులను మాత్రమే లోపలికి అనుమతిస్తాం.

-మధుసూదన్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్, అన్నమయ్య జిల్లా.

అధికారులు వ్యాపారులను బెదిరిస్తే ఇంటికే : మంత్రి

ప్రజాశక్తి - రాయచోటి

అధికారులు వ్యాపారులను బెదిరించినా.. లంచం అడిగినా.. నేరుగా ఇంటికి పంపుతామని రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన రాయచోటి పట్టణంలోని గాంధీ బజార్‌లో పౌర సరఫరాల శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వంట నూనెల ప్రత్యేక విక్రయ కేంద్రాలను ప్రారంభించి వినియోగదారులకు వంట నూనె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యాసర వస్తువులు సరసమైన ధరలకు అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారన్నారు. బహిరంగ మార్కెట్‌లో పామ్ ఆయిల్, సన్ ఫ్లవర్ నూనెలు అధిక ధరలు ఉన్న నేపథ్యంలో నూనె మిల్లుల యజమానులు, వ్యాపారులతో మాట్లాడి వినియోగదారులకు సరసమైన ధరలకు అందించేందుకు వీలుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు ఈ ప్రభుత్వంలో జరగవున్నారు. స్నేహపూరితంగా వ్యవహరిస్తుందని వ్యాపారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు నాణ్యమైన వస్తువులు నిబంధన ప్రకారం విక్రయించాలన్నారు. వ్యాపారులను ఎవరైనా బెదిరించినట్లయితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వ్యాపారులు కూడా ప్రజలతో మమేకమై నిత్యాసర వస్తువులు పంపిణీ చేయాలన్నారు. మిల్లర్ల యజమానులు ప్రభుత్వపరంగా చట్ట బద్ధంగా టాక్స్ చెల్లించవచ్చునన్నారు. ఇకనుంచి ఎవరైనా అధికారులు వ్యాపారులను ఇబ్బందులకు గురి చేసినా, లంచం అడిగినా నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సన్ ఫ్లవర్ (లీటరు) రూ. 124, పామ్ ఆయిల్ రూ. 110లకు విక్రయిస్తున్నారని, జిల్లాలోని ప్రజలందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. **భద్రకాళి సమేత వీరభద్ర స్వామిని దర్శించిన మంత్రి..** విజయదశమి సందర్భంగా పట్టణంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామివారికి శనివారం ఉదయం రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాదరెడ్డి కుటుంబ సమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు .అర్చక స్వాములు పూర్ణకుంభ స్వాగతం, వేద మంత్రోచ్చారణలతో మంత్రిని ఆలయంలోకి తీసుకెళ్లారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి - రాయచోటి : జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాల నేపథ్యంలో ఈ నెల 14న నిర్వహించబోయే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి ఫిర్యాదులను సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని తెలిపారు.

కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కడప : ఎసిఎ అండర్ - 14 ప్లేట్ గ్రూప్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా ఆదివారం వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో వెస్ట్ గోదావరి, ప్రకాశం జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్ గోదావరి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 90.0 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 224 పరుగులు చేసింది. ఆ జట్టులోని కెపి. నారాయణ 71, జితేష్ సాయి రెడ్డి 74 (నాట్ అవుట్) పరుగులు చేశారు. ప్రకాశం జట్టులోని లోకేష్ 3, షేక్ లతీఫ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ప్రకాశం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 8.0 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 24 పరుగులు చేసింది.

కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు, ఈస్ట్ గోదావరి జట్ల మధ్య ప్రారంభమైన మ్యాచ్ హోరాహోరీగా సాగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌ు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 63.5 ఓవర్లలో 205 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని కార్తీక్ 44, రాజ్ ఆర్యన్ 39 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని తేజేష్ 4, దినేష్ 2, ఆశిష్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 37.0 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసింది. ఆ జట్టులోని సాయి చరణ్ 40 పరుగులు చేశాడు. ఈస్ట్ గోదావరి జట్టులోని కార్తీక్ 2, శేఖర్ 2, తమన్ 2 వికెట్లు తీసుకున్నారు.

అమ్మవారి ఊరేగింపులో అపశృతి
విద్యుదాఘాతంతో ఒకరు మృతి - నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - కడప

దసరా ఉత్సవాల్లో భాగంగా పండుగ రోజు శనివారం అర్ధరాత్రి అపశృతి చోటు చేసుకుంది. విద్యుదాఘాతంతో ఒకరు మృతిచెందారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. కడప నగరం బెల్లం బండి రోడ్డులో దుర్ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. దసరా ఉత్సవాల్లో భాగంగా గడ్డి బజార్‌లోని బాలాజీ ఆలయంలోని అమ్మవారి ఊరేగింపు శనివారం రాత్రి ఎద్దుల బండిలో నిర్వహించారు. ఊరేగింపు గండిబెల్లం మండి రోడ్డు వద్దకు రాగానే తగ్గులో ఉన్న విద్యుత్ వైర్లను కర్రలతో పైకి లేపే ప్రయత్నం చేస్తున్న సమయంలో విద్యుత్ వైర్ ఎద్దుల బండికి తగులుకుంది. బండిపై ఉన్న ఐదుగురికి విద్యుత్‌షాక్ తగిలింది. ఈ ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న టూటౌన్ సిఐ నాగార్జున, ఎస్ఐ హుసేన్ సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ వారిని 108 సాయంతో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. వారిలో పెండ్లిమర్రి మండలం ఎర్రమిగుట్ట గంగనపల్లికి చెందిన మేకల రామయ్య (48) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందారు. ఆయన కూలీ పనులు చేసుకుని జీవనం సాగించేవారు. గాయపడిన వారిలో పుష్పగిరికి చెందిన వెంకటరమణ, శ్రీనివాసులు, బెల్లంమండికి చెందిన రంగరాజ్‌తోపాటు రెండున్నరేళ్ల బాలుడు ఉన్నారు. రామయ్య మృతదేహాన్ని పోర్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. విద్యుదాఘాతంలో ఒక ఎద్దు కూడా మృతిచెంది. దీని విలువ సుమారు రూ.6 లక్షలు ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయపడిన వారిన రిమ్స్ ఆస్పత్రిలో డిప్యూటీ మాజీ సిఎం అంజాద్‌బాషా పరామర్శించారు.

ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవంలో పాల్గొన్న సీనియర్ సిటిజన్స్

వయోవృద్ధులకు భరోసానివ్వాలి

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

వయోవృద్ధులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరోసానివ్వాలని ఎపి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నారాయణమూర్తి పేర్కొన్నారు. స్థానిక జిఆర్‌టి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వయోవృద్ధుల సమస్యలు ప్రభుత్వాలు పరిష్కరించాలన్నారు. మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు రైల్వే రాయితీని పునరుద్ధరించాలని కోరారు. 2007 చట్టాన్ని ప్రభుత్వాలు చిత్త శుద్ధితో అమలు చేయాలన్నారు. వయోవృద్ధుల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావును, మహబూబ్ బాషను ఘనంగా సత్కరించారు. సీనియర్ సిటిజన్స్ సమస్యలపై 'కను విప్పు' అనే లఘు చిత్రాన్ని, డైరెక్టర్ రాజా, కథా రచయిత కృష్ణమూర్తి, రాష్ట్ర అధ్యక్షులు ప్రారంభించారు .ప్రపంచ వయోవృద్ధులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రివిలేజ్ కమిటి మెంబర్ ధనలక్ష్మి రాష్ట్ర అధ్యక్షులు నారాయణ మూర్తికి రూ.20 వేలను విరాళం అందజేశారు. చివరిగా ఎన్.మునిగోపాల కృష్ణ, ధనలక్ష్మి దంపతులను రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ సిటిజన్స్ అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి ఉస్మాన్ సాహెబ్, వెలుగు పాఠశాల కన్వీనర్ భాగ్యలక్ష్మి, శకుంతలమ్మ, జగన్మోన్, కృష్ణమోహన్, మునిరత్నమయ్య, ప్రొఫెసర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'పల్లె పండుగ' : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పంచాయతీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికే పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసం వద్ద రామసముద్రం టిడిపి నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రామసముద్రం మండలంలో 14 నుండి 16వ తేదీ వరకు రెండు రోజులపాటు పల్లె పండుగ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అధికారులతో సమన్వయం చేసుకొని గ్రామీణ సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా సిసి రోడ్లు, మురుగునీటి కాలువలు, వీధి దీపాల ఏర్పాటు, పరిశుభ్రతపై దృష్టి సారించాలని కోరారు. మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వర్గ విభేదాలు విడనాడి సిఎం చంద్రబాబుని దృష్టిలో పెట్టుకొని కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. కష్టపడి పనిచేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో నాదెళ్ల విద్యాసాగర్, రామసముద్రం మండల అధ్యక్షులు విజయకుమార్ గౌడ్, మోడెం సిద్దప్ప, షంషీర్, దారం అనిత, నవీన్ చౌదరి, రామిశెట్టి కృష్ణ (కమలామర్రి),ముసలికుంట నాగయ్య బాలు స్వామి, వేణు, పూల మురళి, అన్వర్ బాషా, దుబ్బిగాళ్ల భాస్కర్ పాల్గొన్నారు.

పారదర్శక ఎన్నికలకు పెద్దపీట

- ఉమ్మడి జిల్లాల్లో 370 సంఘాలకు ఎన్నికలు
- జిల్లా ఎన్నికల కమిటీల ఆమోదమే ఆలస్యం
- తెలుగుగంగ ప్రాజెక్ట్స్ ఎస్ఇ డి.వెంకటరామయ్య

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ముఖా ముఖి..

జిల్లాలో సాగునీటి సంఘాలకు పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తాం. ఇటీవల రాష్ట్ర నీటిపారుదలశాఖా మంత్రి 40 రోజుల్లోపు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా కడప, అన్నమయ్య జిల్లాల ఎన్నికల కమిటీ ఆదేశాల అనంతరం ఎన్నికల నిర్వహణ కసరత్తు చేపడతాం. జిల్లాలోని ఆయా చెరువుల పరిధిలోని రైతుల సభ్యత్వాల నమోదు దగ్గర నుంచి పోలింగ్ దశల వరకు పకడ్బందీగా నిర్వహిస్తాం. ఎటువంటి అవాంఛనీయ, వివాదాస్పద సంఘటనలకు అవకాశం లేకుండా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతాం. సాగునీటి సంఘాల ఎన్నికల పట్ల ఆసక్తి కలిగిన రైతులను ప్రోత్సహించి, సాగునీటి పారుదల వ్యవస్థ ఆధునికీకరించడానికి కృషి చేస్తాం. ఫలితంగా రైతుల భాగస్వామ్యంతో చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొంటున్న తెలుగుగంగ ప్రాజెక్ట్స్ సూపరింటెండెంగ్ ఇంజినీర్, అన్నమయ్య జిల్లా డబ్ల్యుఆర్‌డి ఇంజినీర్ డి. వెంకటరామయ్యతో ముఖాముఖి...

సాగునీటి సంఘాల వివరాలు తెలపండి?

కడప జిల్లాలో 206, అన్నమయ్య జిల్లాలో 164 సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఇటీవల రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి రాష్ట్రంలోని 40 రోజుల వ్యవధిలో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్న నేపథ్యంలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించాం.

ఎన్నికల నిర్వహణకు ఏమైనా చర్యలు తీసుకున్నారా?

లేదు. జిల్లా ఎన్నికల కమిటీకి జివోతో కూడిన వివరాలను నివేదించడమైంది. ఉభయ జిల్లాల ఎన్నికల కమిటీ ఆదేశాల ఆధారంగా ముందుకెళ్తాం. తొమ్మిదేళ్ల కిందట ఎన్నికల సభ్యత్వం, 111 మంది ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల నియామకం వంటి అంశాలకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నాం.

పారదర్శక ఎన్నికల నిర్వహణ సాధ్యమేనా!

పారదర్శక ఎన్నికల నిర్వహణకు పెద్దపీట వేస్తాం. సాధ్యమైన మేరకు ఎటువంటి వివాదాలు లేని ఎన్నికల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తాం. గత ఎన్నికల ఫలితాలపై కొందరు కోర్టులను ఆశ్రయించిన నేపథ్య ంలో జాగ్రత్తలు తీసుకుంటాం.

టిజిపి ఆయకట్టు విస్తీర్ణమెంత?

బ్రహ్మంసాగర్ కింద 1.56 లక్షల విస్తీర్ణం ఉంది. ఇందులో 40 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాం. మిగిలిన ఆయకట్టు ఎస్ ఆర్-1, ఎస్ఆర్-2 రిజర్వాయర్లు, ఎడమ, కుడి కాల్వల పరిధిలో ఉంది. ఇందులో జిబిసి, ఓబిసి కెనాల్ ప్రాంతాల్లో పెండింగ్ పనుల్ని పూర్తి చేయడంపై ఆధారపడి ఉంది.

టిజిపి నిల్వ సామర్థ్యం ఎంత?

17 టిఎంసిల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్రస్తుతం 5.50 టిఎంసిలు నిల్వ ఉంది. కుందూ-పెన్నా ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తే ఆయకట్టు పూర్తి స్థాయిలో స్థిరీకరణకు అవకాశం ఉంటుంది.

కెనాల్ లీకేజీ గురించి చెప్పండి?

బ్రహ్మంసాగర్ కుడి, ఎడమ కాల్వల నుంచి నీరు లీకేజీ కొనసాగుతోంది. ఒక కెనాల్ గేజ్‌లకు మరమ్మతులకు గురికావడం, మరో కెనాల్‌లో డ్రమ్స్‌ల సర్దుబాటులో స్తబ్ధత కారణంగా లీకేజీ కొనసాగుతోంది. దీనిపై నాలుగుసార్లు టెండర్లు పిలిచాం. కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఇటీవల తాత్కాలికంగా ఎల్ఎస్‌పి కాంట్రాక్టర్‌తో కదిలించే ప్రక్రియ చేపట్టాం.

పెండింగ్ పనుల పురోగతి ఎలా ఉంది?

బ్రహ్మంసాగర్ కుడి, ఎడమ కాల్వల్లోని జిబిసి, ఓబిసి ప్రాంతా ల్లోని అక్కడక్కడా ఉన్న పెండింగ్ పనులు వేగవంతం చేశాం. ఇందులో భాగంగా ఓబిసి ప్రాంతాల్లోని పెండింగ్ పనుల్ని చేపట్టడానికి కాంట్రాక్టర్ ముందుకు రావడంతో పనులు పట్టాలకు ఎక్కించాం. జిబిసి కాంట్రాక్టర్ ముందుకొస్తే 50 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంది. ఇందులోభాగంగా జిబిసి కింద 20 వేల ఎకరాలు, ఓబిసి కెనాల్ ప్రా ంతంలో 10 వేల ఎకరాలు వెరసి 30 వేల ఎకరాల ఆయకట్టు అందుబా టులోకి రానుంది.

లైనింగ్ పనుల పరిస్థితి ఏమిటి?

బ్రహ్మంసాగర్ కుడి కాల్వ 15 కిలోమీటర్లు, ఎడమ కాల్వ 58 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. రూ.9.7 కోట్లతో ఎడమ కాల్వ లైనింగ్ పనుల్లో 50 శాతం పురోగతి కొనసాగుతోంది. నాలుగు దఫాలుగా పిలి చిన టెండర్లలో జెకె కన్స్ట్రక్షన్ కంపెనీ కాంట్రాక్టును దక్కించుకుని పను లు చేపడుతోంది. రూ.10 కోట్లతో కుడి కాల్వ పనులు చేపట్టాల్సి ఉంది. 700 మీటర్ల అక్విడక్టు పనులు చేపడితే అట్లూరు మండల ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉంది.

లీకేజీ మరమ్మతు ఎంతవరకు వచ్చింది?

బ్రహ్మంసాగర్ లీకేజీ పనులకు రూ.57 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. లీకేజీ ప్రాంతాల్లో 36 ఫిల్లర్లను ఏర్పాటు చేయడమైంది. పోలవరం అథారిటీ నిపుణుల నుంచి అందే సూచనలు, సలహాలను బట్టి ముందుకు వెళతాం. దీంతోపాటు మరో 100 మీటర్లలో చెమ్మ తగిలిన ప్రాంతాన్నీ గుర్తించడమైంది. గ్రౌటింగ్ ప్రక్రియ సహాయంతో చెమ్మను అరి కట్టే ప్రయత్నాలు చేపట్టాల్సి ఉంది.

కుందూ-పెన్నా లిఫ్టు పనుల గురించి చెప్పండి?

కుందూ-పెన్నా ఎత్తిపోతల పనుల్లో స్తబ్ధత నెలకొంది. 56 ఎక రాల భూసేకరణ అనంతరం లిఫ్టు పనులను పూర్తి చేసిన అనంతరం ఎని మిది టిఎంసిలను ఎత్తిపోసే అవకాశం ఉంది.

బకాయిల చెల్లింపులో జాప్యం తగదు

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిల చెల్లింపులో జాప్యం తగదని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎపి జెఎసి సెక్రెటరీ జనరల్ కె.ఎస్.ఎస్. ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం కడపలోని యుటిఎఫ్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలను చెల్లించడంలో గత ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్ సొమ్ములను సైతం గత ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించిందని ఆరోపించారు. ప్రావిడెంట్ ఫండ్ రుణాలతో పాటు, ఎపిజిఎల్ఐ రుణాలు, అంతిమ చెల్లింపులు, సరెండర్ లీవ్ బకాయిలు, డిఎ బకాయిలు, గత పిఆర్‌సి బకాయిలు చెల్లింపులకు నోచుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.22 వేల కోట్ల పైబడిన బకాయిలను ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు, తాము అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలన్నింటిని వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు మాసాలు గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై దృష్టి సారించలేదన్నారు. 2023 జులై 1 నుంచి 12వ పిఆర్‌సి అమలు చేయాల్సి ఉన్నప్పటికీ గత పాలకుల వైఖరి వల్ల అమలుకు నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం సైతం అమలుపట్ల చిత్తశుద్ధి కనపరచడం లేదని ఆరోపించారు. దసరా కనుకగా మధ్యంతర భృతినైనా ప్రకటిస్తారని ఆశగా ఎదురుచూసిన ఉద్యోగుల ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లిందన్నారు. పెండింగ్ డిఎ లను సైతం విడుదల చేయకపోవడం తగదన్నారు. పిఆర్‌సి నూతన కమిషన్‌ను తక్షణం ఏర్పాటు చేయాలని, పిఆర్‌సి అమలయ్యే వరకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు విద్యాబోధనలో మెలుకువలను పెంపొ ందించేందుకు ఫౌండేషన్ లిటరసి న్యూమరసి వృత్యంతర శిక్షణలను ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించిందని, శిక్షణలను ఏ జిల్లాకు ఆ జిల్లాలోని నిర్వహించాలని కోరారు. ఉపాధ్యాయులకు ఇచ్చే శిక్షణలను వేసవి సెలవులలోనే ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు పలుమార్లు ప్రభుత్వాల దృష్టికి తెచ్చినా పెడచెవిన పెడుతున్నారన్నారు. విద్యా సంవత్సరం మధ్యలో శిక్షణల వల్ల పాఠశాలల్లో విద్యాబోధనకు ఆటంకం కలుగుతుందన్నారు. ఆరోగ్య సమస్యలున్న వారిని, 55 ఏళ్లు దాటిన వారికి శిక్షణ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే కృషి చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు, జిల్లా సహాధ్యక్షుడు వై.రవికుమార్, జిల్లా కార్యదర్శులు ఎ.శ్రీనివాసులు, డి.క్రిష్టారెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.హరి ప్రసాద్, షేక్. జాబీర్, జిల్లా కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కె.ఎస్.ఎస్. ప్రసాద్

బలమైన పునాదితోనే లక్ష్యాన్ని చేరగలం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

లక్ష్యాన్ని నెరవేర్చుకునే క్రమంలో పునాది చాలా బలంగా ఉండాలని, ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళితే ఎంతటి లక్ష్యాన్నైనా ఛేదించవచ్చని హైదరాబాద్ కు చెందిన ఇన్ కమ్ టాక్స్ అడిషనల్ ఆఫీసర్ యాదగిరి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సంఘం ఫంక్షన్ హాల్లో విద్యలో మెరిట్ మార్కులు సంపాదించిన కురబ సంఘ విద్యార్థులను ప్రోత్సహించే బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమాన్ని మదనపల్లె డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన యాదగిరి మాటా ్లడుతూ గతంలో కురబ సామాజిక వర్గం నుంచి చదువుకున్న వారు చాలా తక్కువ మందే ఉండడంతో వెనుకబాటు తనంలోనే ఉండిపోయామన్నారు. కాలక్రమేన ప్రతి ఒక్కరిలోనూ చైతన్యం వచ్చి చదువుపై మక్కువ పెరగడంతో ఇటీవల కాలంలో కురుబ సంఘ సామాజిక వర్గం నుంచి కూడా చాలామంది చదువుపై దృష్టి సారిస్తూ విద్యార్థులు ఉన్నత పదవులను అధిరోహిస్తుండడం శుభ పరిణామన్నారు. ఇప్పటి నుంచైనా విద్యార్థులు తమ విద్యలో ఉన్నత ప్రమాణాలతో రాణించాలన్నారు. దీనికి కావలసింది కేవలం గట్టి పునాది మాత్రమేనని గుర్తు చేశారు. పునాది ఎంత బలంగా ఉంటే గెలుపు అంత సునాయాసంగా దక్కుతుందని అన్నారు. అనంతరం ప్రతిభ కనబరచిన కురబ సంఘ విద్యార్థులకు అవార్డు, మోమెంటోలు ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇండియన్ ఫోర్స్ రిటైర్డ్ గ్రూపుకుప్టెన్ కె.పరంధామ గౌడ్, డాక్టర్ ఆర్.వెంకట్రామయ్య, వై.హరి కుమార్ ఆర్.కె శ్రీనివాసులు, మర్రిపాటి రమేష్ , బత్తుని రెడ్డెప్ప, కప్పల నాగరాజ, జె.రుద్రయ్య, దండు రామాంజులు, బి.వి రమణ, బి. రెడ్డెప్ప డి. నరసింహులు, సి.మల్ల య్య, గుడే శ్రీనివాసులు, మేజారి సదాశివ , కురబ సంఘ సామాజిక వర్గ నాయకులు, కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థికి సన్మానం చేస్తున్న సభ్యులు

బాధ్యతలు చేపడుతున్న ఇఒ శ్రీనివాసులు

గంగమ్మ ఆలయ ఇఒగా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన అనంతపురం గంగమ్మ దేవత దేవస్థానమునకు గ్రేడ్ వన్ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు శనివారం అనంతపురం గంగమ్మ దేవస్థానం ఇఒగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేయుచున్న మారుతీ ప్రసాద్ ద్వితీయ శ్రేణి ఇఒ అల్లాడపల్లి శ్రీవీరభద్రస్వామి దేవస్థానానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పని చేస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి దేవదాయ శాఖకు మంచి పేరు తీసుకువస్తానని చెప్పారు. ఆలయ సిబ్బంది కలిసి ఇఒకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంల్లో ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

పల్లె పండుగను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం నుంచి 20వ తేదీ వరకు జరిగే పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను విజయవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి తెలిపారు. 2న గాంధీ జయంతి సందర్భంగా గ్రామ సభలను నిర్వహించి గ్రామంలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదికలను పంపించినట్లు తెలిపారు. ఇటీవల గ్రామ సభలలో గుర్తించిన పనులను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిందన్నారు. ఉపాధి హామీ పథకం నిధుల అనుసంధానం ద్వారా చేపట్టే పనులు గ్రామాలకు స్థిరాస్తులుగా నిలిచిపోతాయని, దీనితో గ్రామాలలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. నిమ్మనపల్లి మండలంలో కూడా అక్టోబర్ 16, 17 వ తేదీలలో రూ.1.50 కోట్ల నిధులతో 40 పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పల్లె పండుగలో భాగస్వామ్యులు కావాలన్నారు. **కలికిరి :** పల్లె పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీ సెక్రెటరీ గోపి గ్రామ ప్రజలను కోరారు. మంగళవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే పల్లి పండుగ గ్రామ వారోత్సవం కార్యక్రమం గుట్టపాలెం పంచాయతీ మూరెవాండ్ల పల్లె గ్రామంలో నిర్వహించనున్నారని తెలిపారు. నూతనంగా సిమెంట్ రోడ్లు నిర్మాణ కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

హార్సిలీహిల్స్‌లో రోడ్డుపై కూలిన చెట్టు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌పై రోడ్డు పై చెట్టు అడ్డంగా కూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. హార్సిలీ కొండపైకి వెళ్లే దారిలో గంగోత్రి సరోవరం వద్ద బలమైన గాలుల కారణంగా మహావృక్షం నేల కూలింది. వాహనాలు రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో యాత్రికులు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహశీల్దార్ మహమ్మద్ అన్సారి ఆ ప్రదేశానికి వెళ్లి రెవెన్యూ, ఫారెస్ట్ సిబ్బంది చేత నేలపడ్డ చెట్టును తొలగింపజేశారు. దీంతో యాత్రికుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూశారు.

మూడు మద్యం దుకాణాలకు 112 దరఖాస్తులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలో మూడు మద్యం షాపులు నిర్వహణకు అత్యధికంగా 112 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. మద్యం దుకాణాలకు ఎవరికి దక్కుతాయనేది సోమవారం తెలియనుంది. గత వైసిపి ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించాలని ఉద్దేశంతో దరఖాస్తులకు ఆహ్వానించింది. మద్యం దుకాణాల నిర్వహణకు విపరీతమైన పోటీ ఏర్పడింది.

గురువులను సన్మానిస్తున్న పూర్వపు విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని ఎస్‌బివిడి సభ పాఠశాలలో ఆదివారం 1992-93 బ్యాచ్‌కు చెందిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అధికార ప్రతినిధి మల్లు సుబ్బ నరసారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. అంతా ఒకచోట చేరి ఒకరినొకరు అప్యాయంగా పలుకరించుకున్నారు. అలనాడి జ్ఞాపకాలను నెమర వేసుకొని ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఒడి నుంచి బయటపడితే ఉపాధ్యాయులు అక్షరాలు దిద్దించి పరిసరాలతో ప్రతిస్తంభించేటట్లు తమను ఉన్నత స్థాయికి చేర్చిన గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులను పూలమాలలు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సాంస్కృతిక సందడి

ప్రజాశక్తి - కడప అర్బన్

శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక సందడి నెలకొంది. శిల్పారామం సాంస్కృతిక వేదికపై విస్పా మూవీ ఆధ్వర్యంలో ఆర్కే డాన్స్ అకాడమీ కమలాపురం వారిచే నిర్వహించిన ప్రదర్శనలు ప్రజలను అబ్బుర పరిచాయి. డాన్స్‌తో ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమాన్ని శిల్పారామం ఎఒ శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు. దసరా పండుగ రోజు 15,000 మంది వీక్షకులు వచ్చినట్లు ఎఒ తెలిపారు. దసరా పండుగ పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలను జయప్రదం చేసిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ట్రిపుల్‌ఐటి అధ్యాపకుడికి ప్రతిభ అవార్డు

ప్రజాశక్తి - వేంపల్లె

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో పనిచేస్తున్న విరూపాక్షి ప్రభాకర్ అనే అధ్యాపకుడు ఎపిజె అబ్దుల్ కలాం నేషనల్ ప్రతిభ అవార్డుకి ఎంపికయ్యారు. ట్రిపుల్‌ఐటిలో ఎనిమిదేళ్ల నుంచి కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విరూపాక్షి ప్రభాకర్ పనిచేస్తున్నారు. తన విధులను నిబద్ధతతో చేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించారు. ఈ నెల 20న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అవార్డు ప్రదానం ఉన్నట్లు విరూపాక్షి ప్రభాకర్ తెలిపారు. ఎపిజె అబ్దుల్ కలాం ప్రతిభ అవార్డు రావడం గర్వకారణంతోపాటు సంతోషంగా ఉందన్నారు. అవార్డు రావడంతోఅధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ సమస్యలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు పట్టణ పరిధిలోని బద్వేల్ రోడ్డు 220కేవీ సబ్ స్టేషన్ ఎదురుగా సోద్దల కృష్ణయ్య పొలాల దగ్గర విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. తీగలు పూర్తి తక్కువ ఎత్తులో ఉండడంతో ట్రాక్టర్లతో సేద్యం చేసుకోవాలంటే చాలా కష్టంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. దీనిపై మైదుకూరు పట్టణ విద్యుత్ ఎఇ రామబద్రయ్యకు ఏడాది క్రితం వినతిపత్రమిచ్చినా, పరిష్కరించకపోవడం చాలా దారుణమని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ పేర్కొన్నారు. సమస్య పరిష్కారం కాలేదని రైతులు తెలియ జేయడంతో రమణ మైదుకూరు పట్టణ రైతు సేవా సమితి కార్యదర్శి కె రామ్మో హన్‌తో కలిసి సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. రమణ రైతులతో కలిసి మాట్లాడుతూ ఈనెల 16న సమస్య పరిష్కరించనందుకు నిరసనగా రైతు సేవా సమితి ఆధ్వర్యంలో మైదుకూరు విద్యుత్ కార్యాలయం దగ్గర ఆందోళన నిర్వహించాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో రైతులు సొద్దల కృష్ణయ్య పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలో చిన్నపాటి వర్షానికి పెద్దూరు కస్బా వంగిమళ్ళ బస్టాండ్ దగ్గర రోడ్డు అధ్వానంగా తయారైంది. ఇళ్ల నుంచి బయట రోడ్డు మీదకి జనాలు రావాలంటే బురద అవుతుందని భయపడుతున్నారు. ఎక్కడి నీరు అక్కడే ఉండడంతో ఈగలు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రులు కునుకు తీయాలంటే కష్టంగా ఉందని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సైడ్ కాలువలు ఏర్పాటు చేయకపోవడంతో నీరు పోయే మార్గం లేక రహదారులలో నీరు నిలిచిపోవడంతో రాకపోకలు ఇబ్బందిగా మారిందన తెలిపారు. పోలీస్ స్టేషను ఎదుట ముందర కాలువలు లేకపోవడంతో ఇళ్లలో నుంచే మరుగు నీరంతా రోడ్డుపైకి చేరింది. పోలీసుస్టేషన్ ఎపిజిబి బ్యాంకుకు వెళ్లాలంటే ప్రజలు ఇబ్బంది పడు తున్నారు. ప్రజలు నడవాలన్నా, వాహనదారులు వెళ్లాలన్నా కష్టంగా ఉందని చెబుతున్నారు. మరుగు కాలువలు లేకపోవడంతో నీరు పోయే మార్గం లేక రహదారి మధ్యలో నీరు నిలిచి పోయిందని పేర్కొన్నారు. మండల కేంద్రంలోనే ఇలా ఉంటే గ్రామాలలో పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆయా గ్రామాల సంద ర్శించి తగు చర్యలు చేపట్టి పరిస్థితి మెరుగుపరచాలని కోరుతున్నారు.

చిన్నపాటి వర్షానికి రోడ్డుపైన నిలిచిన నీరు

ఘనంగా ముగిసిన విజయదశమి వేడుకలు

మదనపల్లి: మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

శరన్నవరాత్రులను పురస్కరించుకొని స్థానిక కోటవీధిలో శ్రీ విజయదుర్గా దేవి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ నెల 9 నుంచి ఆదివారం వరకు ఉత్సవాలు శోభయమానంగా కొనసాగాయి. నవయుగ స్వర్ణకార సంఘం, మదనపల్లె జ్యువెలర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం మేళతాళాలు, బళ్ళారి డ్రమ్స్, బాణాసంచా వేడుకలతో పుష్పపల్లకిలో అమ్మవారి ఊరేగింపు, వైభవంగా జల నిమజ్జనం జరిగింది. భక్తులు, ప్రజలు దుర్గాదేవిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నిమజ్జనం కార్యక్రమంలో శ్రీవిజయ దుర్గాదేవి భక్తులు, మదనపల్లె జ్యువెలర్స్ అసోసియేషన్,నవయుగ స్వర్ణకార సంఘం, నాయకులు పచ్చిపాల రామకృష్ణ అచారి, డాక్టర్ అప్పినపల్లి భాస్క రాచారి,యుగంధర్ ఆచారి, విశ్వ, చిన్న కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు . **మహిళలకు చీరల పంపిణీ..** నీరుగట్టువారిపల్లె టమోటా మార్కెట్ లోని ఎంఆర్‌ఎం మండీ యజమాని ఎస్‌ఎ.మస్తాన్, టిడిపి బిసి సెల్ నియోజకవర్గం అధ్యక్షులు ముసలి కుంట నాగయ్య ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్ బాషా ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఎమ్మెల్యే, ఇతర అతిథులకు పూలమాలలు,శాలువాతో ఘనంగా సన్మానించారు.అనంతరం మండీలో పనిచేస్తున్న మహిళా హమాలీలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామిశెట్టి కృష్ణ, ఖాసీం, ముద్ది మడుగు రామ్మూర్తి, అంబటి చలపతి, బాల, లక్ష్మీపతి, రామకృష్ణ, నరసింహులు,బాబు, హర్షిత, మోక్షిత ఎంఆర్‌ఎం మండీ హమాలీలు పాల్గొన్నారు. **కలకడ :** మండలంలో విజయదశమి సంబరాలను వాడవాడల ఘనంగా నిర్వహిం చుకున్నారు. మండల కేంద్రమైన కలకడలోని వేణుగోపాలస్వామి ఆలయం, దేవళంపేటలో వేసిన శ్రీ కామాక్షి సమేత ఆలయం, దొడ్డిపల్లి పంచాయతీ గోపాలపురం లో వెలిసిన శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం, కోనలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయం, బాటవారిపల్లి పంచాయితీ బిసి కాలనీలో వెలసిన పంచ ముఖ ఆంజనేయ స్వామి ఆలయం, ఎర్రకోట పల్లి పంచాయతీ గువ్వల వాండ్లపల్లెలో శ్రీ సీతారాముల ఆలయంలో విజయదశమి పండుగ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యల ఆలయాలకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నట్టు తెలిపారు. **నందలూరు:** శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో జమ్మి దర్శనానికి ఆలయం నుంచి అరవపల్లి లోని శ్రీకృష్ణ గీతా మందిరం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు మేళ తాళాలు, బాణా సంచా పేలుస్తూ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పూలమాల శాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ మెంబర్ కరిముల్లా ఖాన్, మహిళా మండలి అధ్యక్షురాలు పల్లె మాధవి, వైసిపి నాయకులు తుమ్మల శ్రీధర్, ఎముక దుర్గయ్య, సెమీ ఉల్లా ఖాన్, విజయుడు, ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకట కుమార్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు భూపాలం సునీల్ కుమార్, గెలివి లోకేష్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు. **కలికిరి:** అంకాలమ్మ ఆలయంలో దసరా వేడుకలు ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దసరా మహోత్సవాలను పురస్కరించుకుని కలికిరి క్రాస్ కలకడ రోడ్డులోని అంకాలమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కలికిరి ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అవతారంలో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో, గుట్టపాలెం, పల్లవోలు గుండ్లూరు గ్రామాలలో దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు.

వాలీబాల్ విజేత మంగంపేట పవర్ స్టార్స్

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని మంగంపేట గ్రామం వద్ద నిర్వహించిన 5వ వాలీబాల్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 26 జట్లు పోటీలో పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్ మంగంపేట పవర్ స్టార్స్, అరవింద్ బాయ్స్ హైదరాబాద్ మధ్య హోరాహోరిగా సాగింది. మంగంపేట పవర్ స్టార్స్ జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా అరవింద్ బాయ్స్ హైదరాబాద్ జట్టు నిలిచింది. విన్నర్స్ జట్టుకు రూ.35వేలు, రన్నర్‌కు రూ.25వేలు నగదు బహుమతులను ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా విశాల్ రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 26 జట్లు పాల్గొని వాలీబాల్ టోర్నమెంట్ పాల్గొనడం సంతోషకరమని అన్నారు. మంగంపేటలో రాష్ట్రస్థాయి టోర్నమెంటు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. వచ్చే యేడాది వాలీబాల్ పోటీలను అద్భుతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌డిఎ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, విశాల్ రెడ్డి

బాధితులకు మాజీ సిఎం పరామర్శ

గజ్జల సూరి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి

మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మండలంలోని పలు గ్రామాలను పర్యటించి నాయకులను పరామర్శించారు. స్థానిక మండలంలోని మేడికుర్తి గ్రామపంచాయతీ పసలవాండ్లపల్లికి చెందిన టిడిపి నాయకుడు గజ్జల సురేష్‌రెడ్డి తల్లిదండ్రులు శారదమ్మ, రాజారెడ్డిలను పరామర్శించారు. ఇటీవల వారు అనారోగ్యంతో బాధపడుతుండటంతో విషయం తెలుసుకున్న ఆయన తనకుమారుడు నిఖిలేష్‌రెడ్డితో కలిసి వారి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురేష్ కుమార్‌రెడ్డి కుటుంబం పార్టీకి ఎంతో సేవ చేసిందని గతంలో ఎంపిటిసిగ కూడా గజ్జల శశికళ ప్రజలకు సేవ చేశారని అన్నారు. వారి కుటుంబానికి తాముఅండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు. అనంతరం మరికుంటపల్లి గ్రామపంచాయతీ ఎల్లంపల్లి నందు మాజీ సర్పంచ్ ఆనంద్ రెడ్డి అనారోగ్యంతో ఉండడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో పల్లవోలు రెడ్డప్పరెడ్డి, ఎద్దుల వారి పల్లి శీనా, ఆసాధివారి పల్లి చింతపర్తి సిద్దయ్య, ప్రేమనాథరెడ్డి పాల్గొన్నారు.

అంధులకు చూపునివ్వాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రపంచాన్ని చూడలేని అంధులకు చూపునివ్వాలని డాక్టర్ ఇసి సుగుణమ్మ సూచించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రమీలమ్మ తల్లి చవ్వా వేదామణి ఆదివారం తెల్లవారు జామున మరణించడంతో.. ఆమె కుమారులు విజయశేఖర్‌రెడ్డి, కోడలు సునీత, సులోచన, కుమార్తె ప్రమీలమ్మ, అల్లుడు వైఎస్ మనోహర్‌రెడ్డి నేత్ర దానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారమిచ్చారు. టెక్నీషియన్ హరీష్‌తో కలిసి రాజు పట్టణంలోని మృతురాలి ఇంటికెళ్లి ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ సుగు ణమ్మ సమక్షంలో సుగుణమ్మ పార్థివదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా డాక్టర్ సుగుణమ్మ మాట్లాడుతూ అంధత్వంతో ఈ ప్రపంచాన్ని చూడలేని అంధులకు చూపునివ్వాలంటే నేత్రదానంతో మాత్రమే సాధ్యమన్నారు. మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు దానంతో అంధుల జీవితాల్లో వెలుగు ప్రసాదించే అవకాశం ఉందన్నారు. నేత్రదాన కార్యక్రమం ప్రతి కుటుంబం ఒక సంప్రదాయంగా అలవరచుకోవాలని ఆమె సూచించారు. అంధరహిత సమాజం కోసం ప్రోత్సాహించాలన్నారు. రాజు మాట్లాడుతూ కుటుంబంలోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించిన వెంటనే 99665 09364, 70932 04537కు సమాచారం ఇవ్వాలన్నారు. నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు బంధువులకు, సన్నిహితులకు సేవాసమితి బృందం కృతజ్ఞతాభినందనలు తెలిపారు.

నేత్రనిధి ప్రతినిధులకు కార్నియాలను అందిస్తున్న వేదామణి కుటుంబ సభ్యులు

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

-ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డికి వినతి

ప్రజాశక్తి-పీలేరు

ఆర్‌టిసి ఉద్యోగ, కార్మిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీలేరు ఆర్‌టిసి డిపోకు చెందిన ఉద్యోగులు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని కలసి వినతిపత్రం సమర్పించారు. ఆదివారం నగిరిపల్లిలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఎంయు, ఎంప్లాయిస్ యూనియన్ రెండు సంఘాలు ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యాయని అన్నారు. అంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌ఫోర్ట డిపార్ట్మెంట్ టిఎన్‌టియుసి అనుబంధ సంఘం కార్మిక పరిషత్ ఉద్యోగ సంఘాలకు న్యాయం జరగలేదని ఎమ్మెల్యేకి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షులు ఎస్‌ఎం వలి, కార్యదర్శి డి. సురేంద్ర, సహాయ కార్యదర్శి ఏవి రమణ, ఎం. ఈశ్వరయ్య, ప్రచార కార్యదర్శి జి. రామ్మూర్తి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆర్‌టిసి ఉద్యోగులు

తాగునీటి బోరు వేస్తున్న సర్పంచ్ నాగార్జునచారి

తాగునీటి సమస్య పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని మట్లి పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కరించడం తమ ధ్యేయమని సర్పంచ్ సోమారపు నాగార్జున ఆచారి తెలిపారు. ఆదివారం పంచాయతీలోని ఆసాదివాండ్లపల్లెలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉండడంతో వెంటనే బోరు బండి పిలిపించి బోరు వేయడంతో పుష్కలంగా నీరు పడడంతో సర్పంచ్ కృషిని ప్రజలు అభినందించారు. తమ గ్రామంలో ఎక్కడ ప్రజలు తాగునీటి సమస్య ఎదుర్కోకుండా బృహత్తమైన ప్రణాళికతో ముందుచూపుతో అభివృద్ధిని తీసుకెళుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. మట్లి గ్రామాన్ని ప్రభుత్వ సహకారం అధికారుల సహకారంతో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని తమ వంతు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి కేంద్రమే బాధ్యత వహించాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ప్రొఫెసర్ సాయిబాబా మరణం పీడిత ప్రజా ఉద్యమాలకు తీరని లోటుని పిడియస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. లక్కిరెడ్డిపల్లి మండలం దప్పేపల్లె గ్రామ పంచాయతీ జాంద్రపల్లెలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గుండె సంబంధిత సమస్యలతో ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబ నిమ్స్ హాస్పిటల్‌లో తుది శ్వాస విడిచారు. ఎటువంటి ఆధారాలు లేకుండా పదేళ్లు జైల్లో ఉంచి కేంద్ర ప్రభుత్వం బాధించింది. నిర్బంధ కాలంలో ఆయనకు ఎలాంటి వైద్య సౌకర్యం కల్పించకుండా మానసికంగా వేదించారని అన్నారు. ఆయన ఆరోగ్యం క్షీణించి పోవడానికి కేంద్ర ప్రభుత్వ వైఖరే కారణమని అన్నారు.దీనికి పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఆయన పోరాట స్ఫూర్తితో అన్ని శక్తులు ఐక్యమై బిజెపి ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడటమే ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబాకు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు మండల నాయకుడు మహేష్ పాల్గొన్నారు.

గంగమ్మకు వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి-పీలేరు

తలపుల పంచాయతీలోని ఉలవల గంగమ్మ అమ్మవారికి వెండి కిరీటం బహూకరించారు. పీలేరులోని కడప రోడ్డుకు చెందిన రెడ్డెమ్మ, సురేంద్రరెడ్డి దంపతలు అమ్మవారికి వెండి కిరీటం బహూకరించారు. ఆలయ చైర్మన్లు మల్లికార్జుననాయుడు. వెంకటరమణ నాయుడు, సాగర్ రెడ్డిలకు అందజేశారు. ఆలయంలో పూజారి గణేష్ రాజు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో వినయ్, ఉదయ్, పాల్గొన్నారు.

వెండి కిరీటం వితరణ చేస్తున్న భక్తులు

క్రైం కార్నర్

రైలు కింద పడి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య

-ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడొద్దని సూసైడ్ నోట్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పద్మనాభ రెడ్డి (ఫైల్ ఫొటో)

ఆన్ లైన్ బెట్టింగులకు అలవాటు పడిన ఓ సాఫ్ట్ వేర్ ఇంజినీర్ బలైయ్యాడు. తనలాగా ఎవరూ ఆన్ లైన్ బెట్టింగ్‌లు ఆడొద్దంటూ సూసైడ్ నోట్ రాసి రైలుకింద పడి బలవన్మరణం చెందాడు. ఈ విషాదకర సంఘటన శనివారం మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు..తంబళ్లపల్లె మండలం, ఎద్దులవారిపల్లె పంచాయతీ, దిగువ గాలిగుట్టపల్లెకు చెందిన నడిమింటి వెంకట రమణారెడ్డి కుమారుడు నడిమింటి పద్మనాభరెడ్డి (27) బెంగళూరులోని వోక్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఆన్ లైన్ బెట్టింగ్ కు బానిసై రూ.24 లక్షలు పోగొట్టుకున్నాడు. ఆ అప్పులు తీర్చే మార్గం లేక, జీవితం పై విరక్తి చెంది సూసైడ్ నోట్ రాసుకుని, మదనపల్లి మండలం, సిటియం సమీపంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి ఇంట్లో నుంచి బయటకు వచ్చి ఊరికి సమీపంలోని రెడ్డివారిపల్లె వద్ద తిరుపతి నుంచి మదనపల్లి వైపు వెళుతున్న రైలు కిందపడి మృతి చెందాడు. ఉదయం అటుగా వెళుతున్న స్థానికులు గుర్తించి సిటిఎం రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. కదిరి రైల్వే హెడ్ కానిస్టబుల్ బాషా ప్రమాద స్థలికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించి పంచ నామా నిర్వహించారు. సంఘటన స్థలంలో మృతుడి సెల్‌ఫోన్, లాప్‌టాప్, బెంగళూరులో పనిచేస్తున్న కంపెనీ ఐడి కార్డ్, ఆధార్ కార్డులను గుర్తించిన రైల్వే పోలీసులు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ మృతదేహం వద్దకు చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - రామసముద్రం

అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వెంకట సుబ్బయ్య తెలిపారు. మండలంలోని మినికి గ్రామానికి చెందిన గిరి అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారంతో సిబ్బందితో దాడి చేసి అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు అతని వద్ద నుంచి మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి- రామసముద్రం

మండల పరిధిలోని బెరికాయల గుట్టలో యువకుడు అనుమానాస్పద మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది.. ఎస్‌ఐ వెంకట సుబ్బయ్య తెలిపిన సమాచారం మేరకు.. చెంబకూరు పంచాయతి కాటేవారిపల్లి గ్రామనికి చెందిన రామచంద్ర కుమారుడు రెడ్డిశేఖర్(26) బెరికాయల గుట్టలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని తెలిపారు.. స్థానిక ప్రజలు పోలీసులకు సమాచారం అందించడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తులో తెలియాల్సి ఉందని తెలిపారు.

8 మంది పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-పీలేరు

ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు పీలేరు అర్బన్ ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు. మండలంలోని ముడుపులవేముల పంచాయతీ, ఠాణావడ్డిపల్లె సమీపంలో కొందరు పేకాట ఆడుతున్న సమాచారం అందడంతో తన సిబ్బందితో కలిసి వెళ్ళి దాడి చేశామన్నారు. ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, వారి నుంచి రూ.10,850 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.